క్లుప్తంగా

నేడు ఉత్తరాంధ్ర ఎడ్ల బళ్ల పరుగు పోటీలు

మాడుగుల రూరల్: మండలంలోని ఎం.కోటపాడు, ఎం.కె.వల్లాపురం గ్రామాల ఆరాధ్య దైవం వీరాంజనేయ స్వామివారి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉత్తరాంధ్ర స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలతో పాటు తర్వాత వరుస స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1,500, రూ.వెయ్యి చొప్పున అందిస్తామన్నారు. వంద రూపాయల నామినేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ముందుగా ద్వారపూడి కన్నారావు, సోమరాజు కుటుంబ సభ్యులు సహాయంతో అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరవుతారన్నారు.

ఉచిత శస్త్రచికిత్సలకు రోగుల తరలింపు


డి.గొటివాడలో శస్త్రచికిత్సలకు ఎంపికైన రోగులు

మాడుగుల రూరల్: డి.గొటివాడలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో శస్త్ర చికిత్సలకు ఎంపికైన రోగులను ప్రత్యేక బస్సులో సోమవారం సంగినవలస అనిల్‌నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఇక్కడ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వివిధ రకాల శస్త్రచికిత్సలకు కె.జె.పురం, డి.గొటివాడ, శ్రీరామ్‌పురం, వంటర్లపాలెం గ్రామాలకు చెందిన 35 మందిని ఎంపిక చేశారు. సంస్థ చైర్మన్ రాపేట రామకొండలరావు, డి.గొటివాడ సర్పంచ్ అప్పలనాయుడు, యూత్ సభ్యులు రొబ్బ రాజు, శంకర్, వెంకటేష్, గెమ్మిలి శ్రీను, సత్తిబాబు, బొబ్బిలి హరికృష్ణ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయ శిథిల భవనాల తొలగింపు


శిథిల భవనాన్ని తొలగిస్తున్న దృశ్యం

రావికమతం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిథిలమైన భవనాలను సోమవారం తొలగించారు. 1969లో నిర్మించిన ఆ భవనాలన్నీ పూర్తిగా శిథిలమయ్యాయి. ఎంపీపీ చాంబర్, ఎంపీడీవో కార్యాలయం పైకప్పులు పలుమార్లు ఊడిపడ్డాయి. తాటికర్రలు, ఇనుప రాడ్లు ఊతంగా ఉంచి ఇన్నాళ్లు నెట్టికొచ్చారు. ఈ నేపథ్యంలో రూ.30 లక్షల మండల పరిషత్ గ్రాంటుతో నూతన భవనంలో గ్రౌండ్ ఫ్లోర్ పూర్తి చేశారు. గత నెల 27న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రారంభించిన నేపథ్యంలో సామగ్రిని అక్కడికి తరలించారు. దీంతో పాత భవనాలను తొలగించారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు


గండిపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

మాకవరపాలెం: లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఏఈ బాలకృష్ణ తెలిపారు. భీమబోయినపాలెం శివారు గండిపేట గ్రామస్తులు రెండేళ్లుగా లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల నూతనంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. దీనిని సోమవారం సాయంత్రం ఏఈ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోనూ లోవోల్టేజీ సమస్యలను గుర్తించామన్నారు. దశల వారీగా లోవోల్టేజీతోపాటు ఇతర విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తామన్నారు. లైన్‌మన్ నాగరాజు, సచివాలయ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

25 ఏళ్ల నిరుద్యోగుల నిరీక్షణకు తెర


విశాఖ కలెక్టర్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న పైలా సూర్యనారాయణ(ఫైల్)


ఎంఈవో రవీంద్రబాబు నుంచి జాయినింగ్ ఆర్డర్‌ను అందుకున్న ఉపాధ్యాయులు

- డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థుల ఆనందం
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు

మాడుగుల రూరల్: ఎన్నికల సమయంలో ఎంతో మంది ఎన్నో హామీలు ఇస్తుంటారు. అధికారంలోకి రాగానే వాటిని పక్కన పెట్టేసి చేతులు దులుపుకోవడం పరిపాటి. వీరికి భిన్నమైన మనస్తత్వం కలిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట జవదాటని నవయుగ వామనుడిగా నీరాజనాలు అందుకుంటున్నారు. తాజాగా 1998 డీఎస్సీ అభ్యర్థుల కల నెరవేర్చారు. 25 సంవత్సరాలు నిరీక్షణకు తెరదించారు. వారి జీవితాల్లో వెలుగు నింపారు.

గత ప్రజా సంకల్పయాత్రలో ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి 1998 డీఎస్సీ అభ్యర్థులు తమ సమస్యను మొరపెట్టుకున్నారు. ఆనాడు ఇచ్చిన హామీ మేరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో 355 మంది అభ్యర్థుల జీవితాల్లో వెలుగులు నింపారు. మాడుగుల నియోజకవర్గంలో 30 మందికిపైగా అభ్యర్థులు నియామక పత్రాలు పొందారు. వీరు ఇప్పటికే విధుల్లో చేరారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు చెబుతున్నారు. మాడుగుల మండలం కె.జె.పురం గ్రామానికి చెందిన ఆడారి వెంకటరమణబాబు గాజువాక సమీపంలో అగనంపూడి దరి ఉప్పర కాలనీ ఎంపీపీ పాఠశాలలో చేరారు. వి.వి.అగ్రహారం గ్రామానికి చెందిన దొండ చిన వెంకన్నదొర(ఒమ్మలి దొర)కు ఎం.కృష్ణాపురం పాఠశాలలో పోస్టింగ్ ఇచ్చారు. చీడికాడ మండలం ఖండివరం గ్రామానికి చెందిన కూండ్రపు సత్యానికి ముంచంగిపుట్టు మండలం సుజనకోటలో, బి. సింగవరం గ్రామానికి చెందిన శరగడం కనకరాజుకు అదే మండలం వనభసింగిలో, పెదగోగాడకు చెందిన పైలా సూర్యనారాయణకు చీడికాడ మండలం తునివలసలో పోస్టింగ్ ఇవ్వగా, విధుల్లో చేరారు. చీడిపల్లికి చెందిన మతల కన్నంనాయుడు, మాడుగులకు చెందిన జాగాని రమేష్, తదితర్లు జి. మాడుగుల మండలంలోని వివిధ పాఠశాలల్లో చేశారు. ఉద్యోగం పొందిన చిన వెంకన్నదొరను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు విధుల్లో చేరిక

దేవరాపల్లి: మండలంలో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు నలుగురు విధుల్లో చేరారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో సిహెచ్. రవీంద్రబాబుకు జాయినింగ్ ఆర్డర్లను అందజేశారు. దేవరాపల్లికి చెందిన వేచలపు అప్పలనాయుడు చిననందిపల్లి ఎంపీపీ స్కూల్‌లోను, నాగయ్యపేటకు చెందిన ఆదిరెడ్డి ఈశ్వరరావు చినసోంపురం ఎంపీపీ స్కూల్‌లోను, ఉగ్గినవలసకు చెందిన చిరికి దేముడు కలిగొట్ల ఎంపీపీ స్కూల్‌లోను, సింగందొరపాలెంకు చెందిన నాగభూషణం మామిడిపల్లి ఎంపీపీ స్కూల్‌లోను విధుల్లో చేరారు.

మా కుటుంబాల్లో వెలుగులు



ఇంత వరకు ప్రైవేటు సెక్టారులో పని చేసుకుంటున్నాను. మాకు ఉద్యోగాలు రావని నమ్మకం పోయింది. ఈ నేపథ్యంలో తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలు ఇస్తానని ప్రజా సంకల్ప యాత్రలో జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చారు. మా కుటుంబాల్లో వెలుగులు నింపారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– ఆడారి వెంకటరమణబాబు, కె.జె.పురం, మాడుగుల మండలం

ఉద్యోగం రాదని...



1998 డీఎస్సీలో క్వాలిఫైడ్ అయిన నేను ఇక ఉద్యోగం రాదని ఉద్దేశంతో ఒమ్మలి చెరకు కాటా వద్ద వ్యాపారం ప్రారంభించాను. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దయవల్ల ఉద్యోగం వచ్చింది. సంక్షేమ పథకాలతోపాటు మాలాంటి వారికి ఎంతో మేలు చేసిన ఆయన రెండో సారి ముఖ్యమంత్రి కావడం ఖాయం.

– దొండా చినవెంకన్నదొర, వి.వి.అగ్రహారం, మాడుగుల మండలం

గత టీడీపీ మోసం



డీఎస్సీ 1998లో అర్హత సాధించిన మేము ఉద్యోగాలు కోసం 25 ఏళ్లుగా నిరంతరం పోరాటం చేశాం. గత టీడీపీ ప్రభుత్వం దీనిపై స్పందించలేదు. పాదయాత్రలో ఇచ్చిన హామీని అనుసరించి మా కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– పైలా సూర్యనారాయణ, పెదగోగాడ, చీడికాడ మండలం

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- ఆర్డీవో జయరాం


ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ వారం స్పందనకు 16 అర్జీలు వచ్చాయి. వాటిలో ప్రధానంగా.. జల్‌జీవన్ పథకంలో ఇంటింటికీ కుళాయి వేస్తున్నప్పటికీ తన ఇంటికి కనెక్షన్ ఇవ్వలేదని నర్సీపట్నం మండలం నీలంపేట గ్రామానికి చెందిన శింగంపల్లి స్వామినాయుడు ఫిర్యాదు చేశాడు. నాతవరం మండలంలోని 16 చెరువుల్లో చేపల పెంపకానికి కెమికల్ వాడటం వల్ల పశువులు వ్యాధులు బారినపడుతున్నాయని గునిపూడికి చెందిన మరిడియ్య ఫిర్యాదు చేశాడు. రావికమతం మండలం పొన్నవోలు గ్రామం సర్వే నంబరు 52లో భూముల వివరాలను ఇప్పించాలని బి.అప్పారావు ఆర్డీవోకు కోరాడు.

పండగలా జగనన్నే మా భవిష్యత్తు

దేవరాపల్లి/రోలుగుంట/మాడుగుల/రూరల్/గొలుగొండ: పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు పండగలను తలపిస్తున్నాయి. దీనిలో భాగంగా రోలుగుంటలో వైఎస్సార్‌సీపీ మండల యువజన శాఖ అధ్యక్షుడు మద్దు శివకుమార్, మాజీ ఉప సర్పంచ్ మద్దు తాతబాబు, కార్యకర్తలతో కలసి పలు వీధుల్లో ఇంటింటా తిరిగి సంక్షేమ పథకాల రూప కల్పన, అమలు విధానంలో గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసం వివరిస్తున్నారు. గృహ యజమానుల అభ్యర్థన, ఆసక్తి మేరకు వారి ఇళ్ల గోడలకు సీఎం జగన్ స్టిక్కర్లు అతికించి, సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. కొవ్వూరులో సర్పంచ్ యర్రంశెట్టి సత్యవతి, నిండుగొండలో శెట్టి సంధ్య, కొంతలంలో మాజీ సర్పంచ్ కుంచంగి హరిబాబు ఆ పార్టీ నాయకులు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. దేవరాపల్లి మండలం ములకలాపల్లిలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు అవగాహన కల్పించారు. సర్పంచ్ గొర్లె అన్నపూర్ణ, ఎంపీటీసీ మజ్జి దేవిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గొర్లె కొండలరావు, మజ్జి రాజు, ఉప సర్పంచ్ కర్రి బలరామ్ పాల్గొన్నారు. మాడుగుల మండలం సత్యవరంలో ఎంపీటీసీ తలారి అప్పారావు, సచివాలయ కన్వీనర్లు తలారి కొండతల్లి, కాళ్ల రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు శనివాడ వెంకటరమణ, గోకాడ అప్పలనాయుడు, జాజుల ఈశ్వరరావు, ఎడ్ల మహేష్, గోకేడ ఈశ్వరరావు, యలమంచిలి రమణ కార్యక్రమం నిర్వహించారు. వంటర్లపాలెంలో సర్పంచ్ అల్లాడ నాగేశ్వరరావు సారథ్యంలో ఎంపీటీసీ దండి నాగరత్నం, సచివాలయ కన్వీనర్ కనకారావు అవగాహన కల్పించారు. గొలుగొండ మండలంలో ఏఎల్‌పురం, గొలుగొండ, పప్పుశెట్టిపాలెం, ఎర్రవరం గ్రామాల్లో నాయకులు ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు.

క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరంలో సర్పంచ్ కళావతి, తదితరులు

మాడుగుల: స్థానిక భారత నిర్మాణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పాల కేంద్రం వద్ద ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం జరిగింది. విశాఖ ఆరిలోవకు చెందిన హెచ్.జి.సి క్యాన్సర్ ఆస్పత్రి వైద్యురాలు జి. ఇందిర 200 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథ శ్రీనివాసరావు ప్రారంభించారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నారాయణమూర్తి, ట్రస్టు సభ్యులు గౌరీపట్టపు మహేష్ కుమార్, జాగాని ఈశ్వరరావు, పేలూరి కృష్ణారావు, చందు, ఎం. మణికంఠ, సీహెచ్. మధు, గండి జోగినాయుడు పాల్గొన్నారు.

జాబ్ కార్డుదారులంతా హాజరు కావాలి

దేవరాపల్లి: జాబ్ కార్డుదారులందరూ ఉపాధి పనులకు హాజరు కావాలని ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి ఆదేశించారు. ఏపీవో డి. చంద్రకళతో కలిసి ఆమె తామరబ్బ, చింతలపూడి పంచాయితీలలో సోమవారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా పనులకు హాజరు కాని జాబ్ కార్డుదారులతో మాట్లాడారు. ఇన్‌చార్జి ఈసీ కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోయిలకింతాడలో ఉపాధి పనులు ప్రారంభం

దేవరాపల్లి: బోయిలకింతాడలో ఉపాధి హామీ పనులను సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేతనదారులతో కలిసి ఆయన మట్టి తవ్వి ఉత్సాహ పరిచారు.

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జుల నియామకం



ఆకుల సాయి ప్రసాద్   తాతబ్బాయి

కె.కోటపాడు: చౌడువాడ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా ఆకుల సాయి ప్రసాద్ నియమితులయ్యారు. ఆ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు సోమవారం సాయంత్రం ఆయన తెలిపారు. అవకాశాన్ని కల్పించిన డిప్యూటీ సీఎం బూడికి కృతజ్ఞతలు తెలిపారు.

రోలుగుంట: స్థానిక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా మద్దు తాతబ్బాయి, పర్సన్లుగా దారపురెడ్డి నారాయణమూర్తి, యర్రంశెట్టి అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు వారికి ఆ శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంగళవారం వీరు ప్రమాణ స్వీకారం చేసేందుకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతల లక్ష్మీశ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల యువజన శాఖ అధ్యక్షుడు మద్దు శివకుమార్, తదితరులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మద్దు తాతాబ్బాయి గతంలో ఉప సర్పంచ్‌గా రెండు దఫాలు పని చేశారు.

ఆలయాభివృద్ధికి రూ.15 లక్షల మంజూరు

దేవరాపల్లి: స్థానిక సన్యాసమ్మ ఆలయ ఆవరణలో సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ. 15 లక్షలు మంజూరు చేశారని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తెలిపారు. సోమవారం స్థానిక రామాలయంలో గ్రామ పెద్దలు, ప్రజలతో ఆయన మాట్లాడారు. సుమారు 12 ఏళ్ల తర్వాత అమ్మవారి జాతరను జూన్ 6న నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. జాతర కల్లా సీసీప్లాట్‌ఫాం, ప్రొటెక్షన్ వాల్ నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్నారు. నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, సన్యాసమ్మ ఆలయ ధర్మకర్త లలితానాయుడు, గండిపడాల అప్పలరాజు, గొర్లె సన్యాసినాయుడు, గుండు రాంబాబు, వెత్సా రమేష్ పాల్గొన్నారు.

'మిషన్ వాత్సల్య'లో పేర్ల నమోదు


రోలుగుంట మీ సేవలో నమోదు చేసుకుంటున్న దరఖాస్తుదారులు

రోలుగుంట: 'మిషన్ వాత్సల్య పథకం' నమోదుకు స్థానిక మీ సేవకు పెద్ద ఎత్తున దరఖాస్తుదారులు తరలి వస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు ఎ.పి.జి.వి.బి, బ్యాంకు ఆఫ్ బరోడా, ఎస్.బి.ఐ, ఐ.డి.బి.ఐ. యూ.బి.ఐ బ్యాంకుల్లో మాత్రమే ఖాతాలు తెరచుకోవాలన్నారు. అర్హులైన వారికి ఈ పథకం కింద రూ.4 వేలు మంజూరు చేస్తారని సూచించారు.

రేషన్ వ్యాన్ నిర్వాహకుడి తీరుపై నిరసన

రావికమతం: కల్యాణపులోవ శివారు గిరిజన గ్రామాల్లో రేషన్ సక్రమంగా అందడం లేదంటూ మహిళలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. శివారు కడగెడ్డ, రొచ్చుపణుకు, బంగారుబందల, తాటిపర్తి, అజేయపురం తదితర గ్రామాలకు కల్యాణపులోవ జీసీసీ డిపో నుంచి రేషన్ అందిస్తుంటారు. గత నెలలో తమ గ్రామాలకు రాలేదని వ్యాన్ నిర్వాహకుడు రామును ప్రశ్నించగా సేల్స్‌మన్ ఇవ్వలేదని సమాధానం ఇస్తున్నారని, దీనిపై అధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని గిరిజన మహిళలు ఉల్లి దేముడమ్మ, మాలపర్తి సోములమ్మ, సెగ్గె బాలమ్మ తదితరులు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి సైనికునిల్లా పని చేయాలి

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడికి మొక్కలు అందజేస్తున్న నాయకులు

మాడుగుల: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికునిలా పని చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఒమ్మలి జగన్నాథపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు శామంతుల అచ్చిబాబు, సచివాలయ కన్వీనర్ మజ్జి శంకరరావు, కోఆపరేటివ్ డైరెక్టర్ చామంతుల దొరబాబు, నాయకులు తాడి వెంకటరమణ, సకల సూరిబాబు సోమవారం సాయంత్రం ఆయన్ను తారువలో మర్యాద పూర్వకంగా కలిశారు. మొక్కలు అందజేశారు. వీరి అభ్యర్థన మేరకు గంగాదేవి మండప నిర్మాణానికి రూ.5 లక్షలు, కోలావారి కళ్లాల వద్ద తాగునీటి బోరు మంజూరు చేశారు. పాఠశాల చైర్మన్ బంటు సత్తిబాబు, కార్యకర్తుల పాల్గొన్నారు.

శతశాతం ఎన్నికల హామీల అమలు

- కొత్తకోటలో గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ


కొత్తకోటలో వృద్ధురాలి సమస్య వింటున్న విప్ ధర్మశ్రీ

రావికమతం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీల్లో శతశాతం అమలు చేశారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. కొత్తకోట గ్రామంలో మూడో రోజు సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, ఎవ్వరైనా లంచాలు అడుగుతున్నారా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయి బాబూ అంటూ చిరునవ్వుతో పలువురు బదులిస్తూ సాదరంగా ఆహ్వానించారు. తాను 20 ఏళ్లపాటు కొత్తకోట ఎస్సీ బాలుర వసతి గృహంలో కుక్‌గా కాంట్రాక్టు పద్ధతిలో పని చేశానని కరోనా సోకడంతో అప్పట్లో మానేశానని, ప్రస్తుతం తన పేరును రికార్డుల్లోంచి తొలగించారని ఫెంటపాటి రాజు ధర్మశ్రీ దృష్టికి తీసుకురాగా, ఆయన అక్కడి నుంచే సోషల్ వెల్ఫేర్ డీడీ రమణమూర్తితో మాట్లాడారు. పని పూర్తి చేయాలని ఆదేశించారు. తనకు రెండు కళ్లు కనిపించడం లేదని, మూగదైన తన కుమార్తె మంగకు పింఛను మంజూరు కాలేదని శరకాపు నర్సమ్మ వాపోయారు. ఈ విషయమై ఆయన సంబంధిత వలంటీర్‌తో మాట్లాడారు. సాంకేతిక సమస్యతో సదరం సర్టిఫికెట్ మంజూరు కావడం లేదని వివరించారు. అల్లంకి రమణమ్మ తనకు పింఛన్ ఆగిపోయిందని ధర్మశ్రీ దృష్టికి తీసుకురాగా, ఆమె కుమారుడు ప్రభుత్వ ఉద్యోగి కావడం వల్ల ఆగిపోయిందని తెలుసుకున్నారు. ఒకే రేషన్ కార్డు సమస్యగా గుర్తించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, జెడ్పీటీసీ భర్త తలారి ఆదిమూర్తి, కొత్తకోట సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, నాయకులు శీలం శంకర్రావు, కొత్తకోట ఎంపీటీసీలు కుంచా లక్ష్మి, పూడి దేవా, పైల చినమ్మలు పాల్గొన్నారు.

రూ.35 లక్షలతో తాగునీటి ఎద్దడి నివారణ

- ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి


మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.35 లక్షలతో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశామని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. ఆయన తన కార్యాలయంలో సోమవారం తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో బోర్లు ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిషత్ జనరల్ ఫండ్ నిధులు నుంచి గ్రామాల్లో 20 బోర్లు వేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఒక్కో బోరుకు రూ.1.50 లక్షలు చొప్పున కేటాయించామన్నారు. ఎమ్మెల్యే గణేష్ సూచన మేరకు తాగునీటి పథకాల కుళాయిలు, బోర్లు మరమ్మతులకు అవసరమైన సామగ్రి రూ.5 లక్షలతో కొనుగోలు చేశామన్నారు. మండలంలో 31 గ్రామ పంచాయతీలో 431 చేతిబోర్లు, 122 తాగునీటి పథకాలు, చిక్కుడుపాలెం వద్ద తాండవ నదీలో 16 గ్రామాలకు తాగునీరు అందించేందుకు పైలట్ ప్రాజెక్టు ఉందన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.6.97 కోట్లతో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులు చేస్తున్నామన్నారు. వీటితోపాటు గడప గడపకు కార్యక్రమం నిర్వహించిన గ్రామాల్లో 31 పనులు వివిధ దశలో ఉన్నాయన్నారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దేవరాపల్లి-రైవాడ జలాశయం రోడ్డుకు మోక్షం

- రూ. 90 లక్షలతో తారురోడ్డు నిర్మాణ పనులు


తారురోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి

దేవరాపల్లి: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో దేవరాపల్లి నుంచి రైవాడ జలాశయానికి వెళ్లే రోడ్డుకు మోక్షం లభించిందని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బేతపూడి మీదుగా రైవాడ షిర్డీ సాయిబాబా మందిరం వరకు చేపట్టిన తారు రోడ్డు నిర్మాణ పనులను రెండు గ్రామాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సోమవారం ఆమె పరిశీలించారు. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో రూ. 90 లక్షలతో రెండు కిలోమీటర్ల మేర పక్కా నాణ్యత ప్రమాణాలతో రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. 2005లో రైవాడ జలాశయం ఆధునీకరణ పనుల శంకుస్థాపనకు అప్పటి సీఎం వైఎస్. రాజశేఖరరెడ్డి విచ్చేసిన సమయంలో ఈ రోడ్డు నిర్మించారన్నారు. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకున్న పాపానపోలేదన్నారు. మరలా వైఎస్సార్ తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిర్మించడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. దేవరాపల్లి, రైవాడతోపాటు తామరబ్బ, చింతలపూడి గిరిజన గ్రామాల ప్రజల తరుపున సీఎం జగన్, డిప్యూటీ సీఎంలకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, దేవరాపల్లి సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, చల్లా నాయుడు, ఉగ్రాకుల అప్పారావు, మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, కె.ఎస్. అప్పలనాయుడు, జెసిఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం


గొండుపాలెంలో మాట్లాడుతున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: అధికంగా పోషక విలువలు ఉండే చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం ఉంటారని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. గొండుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు ఆకుకూరలతోపాటు పప్పు దినుసులతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రులోనే సుఖ ప్రసవాలు సాధ్యమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త షేక్ షకీనా, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, సీహెచ్‌వో సింహాచలం పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


మాడుగుల పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారి రాజేశ్వరరావు

మాడుగుల: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఫైర్ అధికారి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఫైర్ అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలు ఇంటి వద్ద వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. లీడింగ్ ఫైర్‌మన్ జె.శ్రీను, డ్రైవర్ పి.ఎస్.ఎస్. వర్మ, ఫైర్‌మన్ పీవీఆర్ మూర్తి, సిబ్బంది పైడిరాజు, కె. నారాయణ, పి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సర్వేపల్లికి ఘన నివాళి


రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

గొలుగొండ: స్థానిక గ్రంథాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి గ్రంథపాలకుడు రాజుబాబు ఘన నివాళులర్పించారు. మొదటి ఉప రాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా దేశానికి ఎన్నో సేవలు అందించిన ఘనత సర్వేపల్లికి దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.